తరలించరు.. తగలబెట్టేస్తారు..

● గ్రామాల్లో అధ్వానంగా చెత్త సేకరణ

భైంసాటౌన్, మే 20 : కేసీఆర్ ప్రభుత్వం గ్రామాల స్వచ్ఛతకు ఎంతోశ్రద్ధ తీసుకున్నది. పల్లె వాసులు ఆరోగ్యంగా ఉండాలంటే గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని భావించి ప్రతి గ్రామంలో డంప్‌యార్డు నిర్మించింది. ప్రతి జీపీకి ట్రాక్టర్‌ను అందించి కార్మికులచే చెత్తను సేకరించి డంప్‌యార్డుకు తరలించేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వం మారడంతో అధికారులు గ్రామాల పరిశుభ్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని వాలేగాం, దేగాం, మహాగాం గ్రామాల్లో చెత్తను డంప్‌యార్డుకు తరలించకుండా వీధుల్లో ఊడ్చేటప్పుడు చిన్నచిన్న కుప్పలుగా చేసి తగలబెడుతున్నారు. దీంతో వాయు కాలుష్యం ఏర్పడి శ్వాసకోశ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను డంప్‌యార్డుకు తరలించే చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

వాలేగాంలో వీధుల్లోనే తగలబెడుతున్న చెత్త

దరఖాస్తుల స్వీకరణ

ఉట్నూర్, మే 20 : 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి బెస్ట్ అవైలెబుల్ పాఠశాలలో 3, 5, 8 తరగతులలో ప్రవేశానికి జూన్ 6వ తేదీలోగా ఉట్నూర్ డీడీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ గిరిజన ఉప సంచాలకుడు దిలీప్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 12వ తేదీన ఉదయం 10 గంటలకు పీఎంఆర్‌సీ బిల్డింగ్ కుమ్రంభీం కాంప్లెక్స్ నందు లాటరీ పద్ధతిన ఎంపిక నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

తాంసి, మే 20: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ రాథోడ్ తులసీరామ్ అన్నారు. సోమవారం నిపాని గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. ఉపాధి హామీ కూలీలు వడ దెబ్బ తగలకుండా నీడపట్టున పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఆశకార్యకర్త నజీమా పాల్గొన్నారు.

పెర్సపేన్‌కు ప్రత్యేక పూజలు

ఎదులాపురం, మే 20 : ఆదిలాబాద్ రూరల్ మండలం చించుఘాట్ గ్రామంలో సోమవారం సోనేకార్ కుమ్రం వంశీయుల కుల దేవత పెర్సపేన్ (పెద్ద దేవుడు)కు మహాపూజ కార్యక్రమాలు ప్రారంభించారు. ఏటా వైశాఖ మాసం చంద్రదర్శనం మొదలు నుంచి అమావాస్య వరకు ఆదివాసీ గోండులు నిర్వహించే పెర్సపేన్ మహాపూజలు ఐదు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఈ పూజలు పటేల్ సోనేకర్ కుమ్ర రాజు, పెన్‌కటోడల్ సోనేకర్ కుమ్ర గణపతి, కుమ్ర రాము ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

సంఘాల బలోపేతానికి వీవోఏలు కృషి చేయాలి

జైనథ్, మే 20 : మహిళా సంఘాల బలోపేతానికి గ్రామస్థాయి వీవోఏలు కృషి చేయాలని ఐకేపీ ఏపీఎం భగవాండ్లు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి పిల్లలకు యూనిఫాంలు కుట్టేందుకు కుట్టు మిషన్లు సిద్ధం చేయాలన్నారు. ప్రతి సంఘం సమావేశాలు, పుస్తక నిర్వహణ చేయాలన్నారు. ప్రతి మహిళకు బీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను ఇప్పించి మహిళలు ఆర్థికంగా ఎదగడానికి దోహదపడాలన్నారు. సమావేశంలో సీసీలు నాందేవ్, ఎల్టీ వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గంగారాం, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ సంతోష్, వీవోఏలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఖానాపూర్ టౌన్, మే 20: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో రవి హెచ్చరించారు. సోమవారం సత్తనపల్లి గ్రామంలోని రైతు వేదికలో ఖానాపూర్, పెంబి ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి డీలర్ స్టాక్, ధరల వివరాల బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రాకేశ్, ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

నిర్మల్ అర్బన్, మే 20 : నిర్మల్‌లోని అన్ని వార్డుల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ప్రియదర్శినినగర్ కాలనీలో డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని కాలనీవాసులు మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఈశ్వర్‌ను కలిసి విన్నవించారు. వెంటనే కాలనీకి వెళ్లి ఆయన పరిసరాలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట కాలనీ వాసులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

కేకే దిక్షిత్ జయంతి వేడుకలు

నిర్మల్ టౌన్, మే 20: నిర్మల్‌లో దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రీయ దివ్యాంగుల పార్టీ వ్యవస్థాపకుడు కేకే దిక్షిత్ జయంతి నిర్వహించారు. దిక్షత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని అనాథలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఇసాక్, శివకుమార్, నిశిత, శ్రీనివాస్, లక్ష్మణ్, వీరయ్య పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయ పాలన పాటించాలి

మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

ఇచ్చోడ(సిరికొండ), మే 20 : రేషన్ డీలర్లు దుకాణాల్లో సమయపాలన పాటించాలని సిరికొండ తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం సిరికొండలోని తహసీల్ కార్యాలయంలో మండల రేషన్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ విధానం ఉండడంతో ప్రజలు ఎక్కడైన రేషన్ తీసుకోవచ్చని, వారికి సహకరించాలని అన్నారు. రేషన్ సరుకులను సరైన తూకంలోనే ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం మండలాధ్యక్షుడు సంతోష్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, సీనియర్ అసిస్టెంట్ ఉమాదేవి, మండల డీలర్లు పాల్గొన్నారు.

రక్తహీనత నిర్మూలనకు చర్యలు

న్యూట్రిషన్‌కిట్లతో గర్భిణులు

నార్నూర్, మే 20 : గర్భిణుల్లో రక్తహీనత నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గాదిగూడ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం గాదిగూడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 10 మంది గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో పవార్ రవీందర్, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ టౌన్, మే 20 : నిర్మల్‌లోని టౌన్ 11 కేవీ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేయనున్నందున మంగళవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ రవి కుమార్ తెలిపారు. కళానగర్, జవహర్‌నగర్, బాగుల వాడ, పంజాగల్లి, చిక్కడపల్లి, కస్బా కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

కుంటాల, మే, 20: 33 కేవీ కుంటాల సబ్‌స్టేషన్‌లో ఫీడర్ మరమ్మతులు చేయనున్నందున ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కుంటాల, గొల్లమాడ పరిధిలో గల అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది ఏఈ శివ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

వాగులో పడి యువకుడి మృతి

ఎదులాపురం, మే 20 : ఆదిలాబాద్ రూరల్ మండలం లాండస్వాంగి వాగులో సోమవారం యువకుడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందినట్లు రూరల్ ఏఎస్ఐ సునీత తెలిపారు. ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీకి చెందిన షేక్‌షాకిర్ కుమారుడు షేక్ ఆయన్ (15) తన స్నేహితులతో కలిసి వేసవి సెలవులు కావడంతో సోమవారం లాండస్వాంగి వాగులో స్నానం చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో వాగులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. కాగా ఇటీవల పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

పలువురిపై కేసు నమోదు

ఎదులాపురం, మే 20 : ఆదిలాబాద్‌లోని టూ టౌన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన గొడవలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ లాల్‌సింగ్ తెలిపారు. కిట్టు, మల్లేశ్‌లతో పాటు మరికొందరు ఆదివారం రాత్రి స్థానిక కాకతీయ బార్ సమీపం నుంచి వెళ్తున్నారు. ఇదే సమయంలో బస్టాండ్ నుంచి నడుచుకుంటు షేక్ అజిమ్, గణేశ్ వస్తున్నారు. ఈక్రమంలో నడుచుకుంటు వస్తున్న సమయంలో తాకినందుకు షేక్ అజిమ్, గణేశ్‌పై దాడి చేశారు. దాడి చేసిన కిట్టు, మల్లేశ్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బాధితుడితో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్, మే 20: గొసంపల్లి, అడవి సారంగాపూర్, సుర్జాపూర్ గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. గొసంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహేశ్‌కు రోడ్డు ప్రమాదంలో గాయాలు కాగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అడవి సారంగాపూర్‌లో ఆదివాసీ కుటుంబాలను పరామర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. ఆదివాసీలకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

సారంగాపూర్, మే 20: బీరవెల్లి గ్రామానికి చెందిన మేకల ధర్మయ్య సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు దశరథ రాజేశ్వర్, మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, వంజరి రాజేశ్వర్, రాజేంద్రప్రసాద్, శ్రీధర్, ముజ్జు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి ముగ్గురికి గాయాలు

బైంసా, మే 20 : బైంసా శివారులోని సోమవారం సాయంత్రం జరిగిన వేర్వేరుగా రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. కుభీర్ మండలం పల్సి గ్రామానికి చెందిన కొండ సాగర్‌గౌడ్ నిజామాబాద్ నుంచి భైంసా వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా హరియాలి పెట్రోల్ బంకు సమీపంలో కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పట్టణంలోని ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇలేగాం గ్రామానికి చెందిన లక్ష్మణ్ ద్విచక్ర వాహనంపై భైంసాకు వస్తుండగా గుర్తు తెలియని మరో వాహనం ఢీ కొని గాయాలయ్యాయి. 108 సిబ్బంది ఏరియా దవాఖానకు తరలించగా సిబ్బంది చికిత్స అందిస్తున్నారు.

ఎదులాపురం, మే 20 : మావల పోలీస్ స్టేషన్ పరిధిలో హరితవనం వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా కడెం గ్రామానికి చెందిన నర్సయ్య, భార్య రాధ ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ వస్తున్నారు. మావల హరితవనం 44వ నంబర్ గల జాతీయ రహదారి పై వీరు ప్రయాణిస్తున్న వాహనం ముందు చక్రం ఒక్కసారిగా రాడ్ విరిగిపోయి కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్ సిబ్బంది కిషన్, ముజాఫర్ క్షతగ్రాత్రులకు ప్రథమ చికిత్స అందించి రిమ్స్‌కు తరలించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తమకు చదువు నేర్పిన గురువులతో పూర్వవిద్యార్థులు

జైనథ్, మే 20 : కూర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం అదే పాఠశాలలో కలుసుకొని నాటి జ్ఞాపకాలు పంచుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను పిలిచి సన్మానించారు. కార్యక్రమంలో గురువులు జగదీష వెంకటేశ్వర్, రాజేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్, వేణుగోపాల్, నారాయణ, అశోక్, శ్రీనివాస్, మచ్చేందర్, గోవర్ధన్, నారాయణ, మాజీ సర్పంచ్‌లు బద్దం కేశవ్ రెడ్డి, లత వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణానికి రండి..

దిలావర్‌పూర్, మే 20 : దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామంలోని శ్రీ కాల్వ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి జరిగే బ్రహ్మోత్సవ, కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని సోమవారం ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యుడు (సిర్గాపూర్ గ్రామానికి చెందిన) నిరంజన్‌రెడ్డిని కలిసి ఆహ్వానపత్రికను ఆలయ చైర్మన్ పూజారం మహేశ్, పాలక మండలి సభ్యులతో కలిసి అందజేశారు. అలాగే నిర్మల్‌లోని పలువురు ప్రముఖులను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇక్కడ ఆలయ డైరెక్టర్ గుమ్ముల నర్సయ్య, ప్రీతమ్‌రెడ్డి, తమ్మ మహేశ్, భక్తులు ఉన్నారు.

మూఢ నమ్మకాలపై అవగాహన

ఉట్నూర్, మే 20 : ఉట్నూర్‌లోని కుమ్రంభీం ప్రాంగణంలో సమ్మర్ క్యాంపు విద్యార్థులకు నిత్యం జీవితంలో ఎదుర్కొంటున్న మూఢ నమ్మకాలను ఏలా ఎదుర్కొని ముందుకు సాగాలో జన విజ్ఞాన్ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్, సైన్స్ మేజిషియన్ మెస్రం రాజు సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బాదు, స్పోర్ట్స్ కోచ్ సునంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

ముథోల్, మే 20 : ముథోల్‌లో అందుబాటులో జీలుగ విత్తనాలు ఉన్నాయని ఏవో భాస్కర్ తెలిపారు. జీలుగ విత్తనాల 30 కేజీల బ్యాగు ధర రూ.1,116 ఉందని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు రైతు వేదికలో ఏఈవో దగ్గర పర్మిషన్ తీసుకొని సొసైటీలో డబ్బులు చెల్లించాలని సూచించారు.

నేడు జొన్నల కొనుగోలు నిలిపివేత

తాంసి, మే 20 : మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో గన్ని సంచుల కొరత ఏర్పడడంతో మంగళవారం జొన్నల కొనుగోలు నిలిపివేస్తున్నామని ప్రాథమిక సహకార సంఘం సీఈవో కేశవ్ తెలిపారు. ఈ విషయాన్ని మండలంలోని రైతులు గమనించి మార్కెట్ యార్డుకు జొన్నలు తీసుకురావొద్దని సూచించారు. బుధవారం యథావిధిగా జొన్నల కొనుగోలు చేపడుతామని పేర్కొన్నారు.

కిక్ బాక్సింగ్ కిట్ అందజేత

క్రీడాకారిణికి కిట్ అందజేస్తున్న కృష్ణంరాజు మిత్రులు

ఖానాపూర్ రూరల్, మే 20 : సింగాపూర్ గ్రామానికి చెందిన జీ నాగలక్ష్మి అనే క్రీడాకారిణికి ఖానాపూర్ వాస్తవ్యులు కృష్ణంరాజు రూ.12వేల విలువ గల కిక్ బాక్సింగ్ కిట్‌ను వారి మిత్రుల ద్వారా సోమవారం అందజేశారు. ఈ నెల 21వ తేదీన పుణేలో నిర్వహించే జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా చేయుతనిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో భీమన్న, రాము, సాకేత్, సురేశ్, శ్రీనివాస్, శ్రీకాంత్, రవీందర్, రాజన్న, సతీశ్, ప్రమోద్, హరీశ్ పాల్గొన్నారు.

కలప పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న కలప దుంగలతో అధికారులు

ఇచ్చోడ(సిరికొండ), మే 20 : సిరికొండ మండలం ఫకీర్‌నాయక్ తండా నుంచి మండల కేంద్రానికి అక్రమంగా తరలిస్తున్న కలపను డిప్యూటీ రేంజ్ అధికారి గిరయ్య సోమవారం పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు జీపులో తనిఖీలు నిర్వహించగా రూ.50 వేల కలప లభించింది. కలపతోపాటు జీపును సీజ్ చేసినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి గిరయ్య తెలిపారు. తనిఖీలో సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జిపై నుంచి వాగులో పడ్డ సిమెంట్ లారీ

వాగులో పడ్డ సిమెంట్ లారీ

భైంసాటౌన్, మే 20 : భైంసా మండలం వానల్‌పాడ్ గ్రామ సమీపంలోని బ్రిడ్జిపై నుంచి సోమవారం తెల్లవారుజామున మంచిర్యాల జిల్లా దేవాపూర్ నుంచి సిమెంట్ లోడుతో భైంసా వైపు వెళ్తున్న లారీ వాగులో పడిపోయింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని అందులో ఉన్న డ్రైవర్ లవకుశ్ సరోజ్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో భైంసా ఏరియా దవాఖానకు తరలించారు.

కాలనీకి నీటి సరఫరా

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

దస్తురాబాద్,మే 20 : దస్తురాబాద్‌లోని ఓ కాలనీకి మిషన్ భగీరథ పైపులైన్ దెబ్బతినడంతో నెల రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. కొద్ది రోజుల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ అనే శీర్షిక కథనం నమస్తే తెలంగాణలో ప్రచురితం కాగా అధికారులు స్పందించి తాత్కాలికంగా మరమ్మతులు చేసి నీటి లికేజీకి అడ్డుకట్ట వేశారు. సోమవారం మిషన్ భగీరథ పైపులైన్‌కు శాశ్వతంగా మరమ్మతులు చేసి ఆ కాలనీకి నీటి సరఫరా చేయడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కారోబార్ శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ కవి సమ్మేళనానికి వెంకట్ ఎంపిక

నిర్మల్ అర్బన్, మే 20 : ఈ నెల 26వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరులో నిర్వహించే అంతర్జాతీయ శతాధిక పద్యకవుల సమ్మేళనానికి నిర్మల్‌కు చెందిన తెలంగాణ రచయితల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రముఖ కవి వెంకట్ ఎంపికయ్యారు. సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే పద్య కవుల సమ్మేళనంలో వెంకట్ కవితా గానం చేయనున్నారు. వెంకట్‌ను పలువురు కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మైసేకర్ సాయిలు సేవలు అభినందనీయం

వృద్ధులకు చీరెలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్‌తో మైసేకర్ సాయిలు (ఫైల్)

భైంసా, మే 20: అనాథలు.. అభాగ్యులు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులకు సహాయం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు భైంసాకు చెందిన మైసేకర్ సాయిలు. ఎస్సీ ఫర్ ఎస్సీ రైట్స్ అనే సేవా సంస్థ స్థాపించి తన కున్నదంట్లో కొంతైనా కూడబెట్టి పరులకు సహాయపడాలని నిశ్చయించుకున్నారు. 20 సంవత్సరాల క్రితం ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ఎంతో మందిని ఆదుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, వృద్ధులు, పేదలకు దుప్పట్లు అందజేస్తూ తమవంతు సహాయం చేస్తున్నారు. అంతేగాకుండా సీజనల్ వ్యాధులతో సతమతమవుతున్నప్పుడు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. దహన సంస్కారాలకు కూడా డబ్బులేని పేదింటి ప్రజలకు డబ్బు లిచ్చి మనోధైర్యాన్ని చాటుకుంటున్నాడు. దసరా పండుగ సమయంలో మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్నాడు. అంతేగాకుండా ఇప్పటి వరకు 250 మంది పేదలకు ఉచితంగా పెండ్లిళ్లు సైతం చేశారు.

చేతనైనా సహాయం చేస్తున్నా

ఎస్సీ ఫర్ ఎస్సీ రైట్స్ సంస్థ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. పేద విద్యార్థుల చదవుకు ఉన్నంతలో చేతనైనా సహాయం చేస్తున్నా. ఇప్పటి వరకు 250 మంది నిరుపేదలకు పెండ్లిళ్లు చేశాను. పేదలకు దుప్పట్లు, చీరెలు పంపిణీ చేశాం. నాకు చేతనైనంతా సహాయం అభాగ్యులకు చేస్తూనే ఉంటా.

-మైసేకర్ సాయిలు,
ఎస్సీఫర్ ఎస్సీ రైట్స్ అధ్యక్షుడు

సామాజిక సేవ యువకులకు గ్లోబల్ ఐకాన్ అవార్డు

అవార్డు అందుకుంటున్న నరహరి,మనోజ్ యాదవ్

నిర్మల్ చైన్‌గేట్, మే 20 : నిర్మల్‌లోని కురన్నపేటకు చెందిన డాక్టర్ తలకొక్కుల నరహరి, డాక్టర్ మనోజ్ యాదవ్ దశాబ్ద కాలం నుంచి ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడంతో మంజునాథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్లోబల్ ఐకాన్ అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ వెనుకబడిన తరగతుల చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు.

పీఆర్టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవిరాజు

నియామక పత్రాన్ని అందజేస్తున్న సాయన్న

నిర్మల్ అర్బన్, మే 20 : పీఆర్టీయూ నిర్మల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వొడ్నాల రవిరాజ్ నియామకమైనట్లు జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి రాజ్‌కు నియామక పత్రాన్ని జారీ చేశారు. సోమవారం నిర్మల్‌లో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రాన్ని కార్యవర్గ సభ్యులు అందజేశారు. రాజును పలువురు అభినందించారు. కార్యక్రమంలో హరిప్రసాద్, శంకర్, చంద్రకాంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేరాలి

బోథ్, మే 20 : ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్యను అందిస్తోందని, ప్రైవేట్ కళాశాలలో చేరి ఆర్థికంగా నష్టపోవద్దని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ అన్నారు. సోమవారం మర్లపల్లి, కన్గుట్ట, పొచ్చెర గ్రామాల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా వందశాతం ఫలితాలకు కృషి చేస్తుందన్నారు. అధ్యాపకులతో శిక్షణ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో, కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మణ్, నగేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్ : విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

నార్నూర్, మే 20 : పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ మహేందర్ కుమార్, అడ్మిషన్ ఇన్‌చార్జి బాలాజీకాంబ్లే అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు . ప్రతి ఏటా ప్రభుత్వ కళాశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నట్లు ప్రచారం నిర్వహిస్తునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

కూచిపూడిలో నిర్మల్ వాసి ప్రతిభ

అవార్డు, ప్రశంసాపత్రం అందుకుంటున్న సరిత

నిర్మల్ అర్బన్, మే 20 : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో నిర్మల్‌కు చెందిన అనంతుల సరిత ప్రతిభ కనబర్చినట్లు నృత్యమాల అకాడమీ శిక్షకురాలు ఏలేటి అంజలి రెడ్డి తెలిపారు. అన్నమాచార్యుల 616వ జయంత్యుత్సవాల్లోని కూచిపూడి నృత్య ప్రదర్శన పోటీల్లో సరిత నాట్య కౌస్తుభ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందుకుంది. ఆమెను నృత్య శిక్షకురాలు అంజలి, పట్టణ ప్రజలు అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All